

వైద్య శిబిరాలతో మేలు
ఉచిత వైద్య శిబిరాలతో పేదలకు మేలు చేకూరుతుందని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. 8లో▸



హామీలతో మోసం
కాంగ్రెస్‌ను నమ్మి ఓటేసిన రైతులను ప్రభుత్వం నిండా ముంచుతోందని మాజీ ఎమ్మెల్యే ఆనంద్ ఆరోపించారు. 8లో▸



ప్రకృతి వ్యవసాయం
వ్యవసాయం ఖర్చుతో కూడుకుంది. ఎరువులు వినియోగించకపోతే పంటలు పండే పరిస్థితి అంతతమాత్రమే. 9లో▸

న్యూస్‌రీల్

అతిథిగృహ నిర్మాణానికి భూమి పూజ నేడు

కొడంగల్: పట్టణంలోని సిటిజన్ క్లబ్‌లో రూ.6 కోట్ల వ్యయంతో ఆర్‌అండ్‌బీ అతిథిగృహం నిర్మించనున్నారు. ఈ మేరకు సోమవారం ఉదయం 10 గంటలకు భూమిపూజ చేయనున్నారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి హాజరవుతారని ఆయన వ్యక్తిగత సిబ్బంది తెలిపారు. అనంతరం ఆయన ఉదయం 11గంటలకు బొంరాస్‌పేటలో గ్రంథాలయ భవన నిర్మాణానికి భూమి చేస్తారని చెప్పారు. అనంతరం తుంపర్ల సేద్యం పరికరాలు, మధ్యాహ్నం 12 గంటలకు కోస్గిలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేస్తారని వివరించారు.

పేద విద్యార్థుల్లో వెలుగులు నింపాలి

స్వేరోస్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్



ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను సన్మానిస్తున్న స్వేరోలు

పరిగి: పేద విద్యార్థుల్లో వెలుగులు నింపడమే లక్ష్యంగా స్వేరోస్ నెట్‌వర్క్ పనిచేయాలని స్వేరోస్ నెట్‌వర్క్ వ్యవస్థాపకుడు, బీఆర్‌ఎస్ నేత ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. ఆదివారం ఆయన కర్ణాటకు వెళ్తున్న క్రమంలో పరిగిలో స్వేరోస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు లక్నాపూర్ శ్రీనివాస్ నివాసంలో స్వేరోస్ సభ్యులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ.. ఆర్థిక ఇబ్బందులతో చదువుకు దూరమమయ్యే వారికి మన నెట్‌వర్క్ నుంచి సాయం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో స్వేరోస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మంచన్‌పల్లి శ్రీనివాస్, నాయకులు వెంకటయ్య, బుచ్చన్న, రాజేందర్, వెంకటేశ్, బసిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతుకు భరోసా ఇవ్వని ప్రభుత్వం

హెచ్‌ఎం ఉస్మాన్‌అలీకి అబ్దుల్ కలాం నేషనల్ అవార్డు



అవార్డు అందుకుంటున్న ఉస్మాన్‌అలీ

పరిగి: మండల పరిధిలోని మిట్టకోడూరు ప్రాథమిక పాఠశాలలో హెచ్‌ఎంగా పని చేస్తున్న ఎండీ.ఉస్మాన్‌అలీని అబ్దుల్ కలాం నేషనల్ అవార్డుతో సత్కరించారు. ఆదివారం నగరంలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో బహుజన సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయనకు ఈ అవార్డు అందజేశారు. ఈ సందర్భంగా ఉస్మాన్ అలీ మాట్లాడుతూ.. ఉపాధ్యాయ వృత్తిని కొనసాగిస్తూ తన సాహిత్య ప్రయాణం సాగుతుందన్నారు.

ఉద్యమకారులను విస్మరించిన ప్రభుత్వం

టీయూఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బల్‌దేవ్ రెడ్డి



సమావేశంలో ఉద్యమకారుల అభివాదం

తుర్కయంజాల్: తెలంగాణ ఉద్యమకారులను కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరించిందని టీయూఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కందాల బల్‌దేవ్ రెడ్డి విమర్శించారు. ఉద్యమకారులకు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఆదివారం ఫోరం జిల్లా అధ్యక్షుడు యాదిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో ఉద్యమకారుల పాత్ర కీలకమైందన్నారు. 10 ఏళ్ల అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయలేదని ఆరోపించారు. ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎన్నికలకు ముందు ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం, పింఛన్లు, ఉచిత బస్సు సౌకర్యం వంటి హామీలు ఇచ్చారని పేర్కొన్నారు. ఇచ్చిన మాటను నెలాఖరులోగా నిలబెట్టుకోవాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు విష్ణువర్ధన్, ఆర్గనైజింగ్ సెక్రటరీ నరేందర్, దక్షిణ తెలంగాణ అధ్యక్షురాలు శ్యామల, బీజేపీ ఎస్సీమోర్చా రాష్ట్ర కార్యదర్శి రమేష్, మున్సిపాలిటీ అధ్యక్షుడు జంగయ్య గౌడ్, నాయకులు వీరస్వామి గౌడ్, దాసుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

దాడుల వెనుక దందా..?

వివాదాస్పదంగా మారిన మెడికల్ కౌన్సిల్ దాడులు

- ప్రైవేట్ ఆస్పత్రుల యాజమాన్యాలు వెంట రావడంతో తప్పుడు సంకేతాలు
- ఆర్‌ఎంపీలను దారిలోకి తెచ్చుకునేందుకే దాడులని ఆరోపణలు
- తమ ఆస్పత్రులకు రెఫర్ చేయని ఆర్‌ఎంపీలే టార్గెట్..?



పరిగి ఆర్‌ఎంపీ క్లినిక్‌పై దాడులు నిర్వహిస్తున్న మెడికల్ కౌన్సిల్ అధికారులు(ఫైల్)

వికారాబాద్: మెడికల్ కౌన్సిల్ బృందం ప్రైవేటు క్లినిక్‌లపై చేసిన దాడులు వివాదాస్పదంగా మారాయి. శనివారం హైదరాబాద్ నుంచి వచ్చిన మెడికల్ కౌన్సిల్ సభ్యులు వికారాబాద్, రంగారెడ్డి జిల్లాల పరిధిలో విస్తృతంగా దాడులు చేసిన విషయం విదితమే. ఈ రెండు జిల్లాల పరిధిలోని వికారాబాద్, తాండూరు, పరిగి, ధారూరు, మొయినాబాద్ తదితర చోట్ల తనిఖీలు చేపట్టి అర్హతలేకుండా వైద్యం నిర్వహిస్తున్న 25 మంది ఆర్‌ఎంపీల క్లినిక్‌లలో సోదాలు నిర్వహించారు. విషయం తెలుసుకున్న పలువురు ఆర్‌ఎంపీలు క్లినిక్‌లకు తాళాలు వేసి పరుగులు తీశారు. దీంతో అనుమతులు, అర్హత లేకుండా నిర్వహిస్తున్న క్లినిక్‌ల వివరాలు నమోదు చేసుకున్నారు. కాగా వారు చర్యలకు సిఫారసు చేస్తూ మెడికల్ అండ్ హెల్త్ జిల్లా అధికారికి రాయాల్సి ఉంది. అయితే ఈ తనిఖీల్లో మెడికల్ కౌన్సిల్ అధికారుల బృందం వ్యవహరించిన తీరు వివాదాలకు తావిచ్చింది. అధికారుల వెంట ప్రైవేటు ఆస్పత్రుల యజమానులు ఉండడంతో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వారు వ్యవహరించిన తీరు పలు అనుమానాలకు తావిస్తోంది.

సంజాయిషీ ఇచ్చుకుంటున్న ప్రైవేటు యాజమాన్యం

ఉమ్మడి జిల్లా పరిధిలో తనిఖీలు చేపట్టిన మెడికల్ కౌన్సిల్ బృందం వెంట వికారాబాద్‌లో ప్రైవేట్ ఆస్పత్రులు నిర్వహించే వైద్యులున్నారు. దీంతో మెడికల్ కౌన్సిల్ బృందం సభ్యులపై ఆరోపణలు వినిపిస్తున్నాయి. జిల్లా వ్యాప్తంగా ఇదే చర్చ కొనసాగుతుండడంతో దిద్దుబాటు చర్యలకు దిగారు. తమను సాక్షులుగా చూపేందుకు వెంట తీసుకెళ్లారని ప్రైవేటు ఆస్పత్రుల యాజమన్యాలు సంజాయిషి ఇచ్చుకునేందుకు యత్నిస్తున్నాయి. కాగా రెవెన్యూ ఉద్యోగులు లేదా ఇతర శాఖల ప్రభుత్వ ఉద్యోగులను కాదని ప్రైవేటు ఆస్పత్రుల యజమానులను వెంట తీసుకెళ్లి మెడికల్ కౌన్సిల్ అధికారులు ఏం సంకేతాలు ఇవ్వదల్చుకున్నారని ప్రశ్నల వర్షం కురిపిస్తున్నారు. సాధారణంగా వ్యవసాయ తదితర శాఖలు ఇలాంటి దాడులు నిర్వహించాల్సి వస్తే రెవెన్యూ, పోలీసు శాఖల అధికారులను తీసుకెళ్తుంటారు.

బెదిరింపులకు పాల్పడుతున్న ఆస్పత్రుల ఓనర్లు

మెడికల్ కౌన్సిల్ సభ్యులు అనుమతులు లేని ఆర్‌ఎంపీలు, పీఎంపీల క్లినిక్‌లను తనిఖీ చేయడం హర్షణీయమే. కానీ కొందరు ప్రైవేటు ఆస్పత్రుల యజమానులు ఆర్‌ఎంపీలు, పీఎంపీలను తమ దారికి తెచ్చుకునేందుకే మెడికల్ కౌన్సిల్‌ను సంప్రదించి ఇలా దాడులు చేసేలా ప్రోత్సహించారనే ప్రచారం జరుగుతోంది. ఆర్‌ఎంపీలు తమ ప్రైవేటు ఆస్పత్రులకు రోగులను రెఫర్ చేస్తే భవిష్యత్‌లో ఇలాంటి దాడులు ఉండవనే సంకేతాలు ఇచ్చేందుకే చేయించారని ఆర్‌ఎంపీల సంఘం నాయకులు ఆరోపిస్తున్నారు. ఆర్‌ఎంపీలు తమ దారికి వస్తే ఇలాంటి దాడులు జరగకుండా తామే చూసుకుంటామనే భరోసా ఇస్తామని యజమానులు వారికి చెప్పినట్లు పుకార్లు వస్తున్నాయి. వికారాబాద్‌లో కొత్తగా ఏర్పాటు చేసిన ఓ ప్రైవేటు ఆస్పత్రి బాగా నడుస్తుండటంతో సదరు వైద్యురాలిపై కొందరు ప్రైవేటు ఆస్పత్రుల ఓనర్లు బెదిరింపులకు పాల్పడ్డారు. చివరకు బయటకు పొక్కటంతో కొందరు నేతలు రంగంలోకి దిగి సెటిల్ చేయడం ఇటీవల చర్చనీయాంశంగా మారింది. కాగా మెడికల్ కౌన్సిల్ బృందం వెనకాల వెళ్లిన ప్రైవేటు యజమానులు నిర్వహించే ఆస్పత్రుల్లోనూ ఇటీవల వైద్యం వికటించి రోగులు మృతి చెందటంతో గుట్టుగా సెటిల్‌మెంట్ చేసుకుని మిన్నకున్నారని ఆరోపణలున్నాయి.

ఫార్మా వద్దంటే కొట్టిస్తారా



గాయపడిన మహిళను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి

- భూములు లాక్కుంటే ఊరుకోం
- గిరిజనులకు అండగా ఉంటాం
- కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి
- రోటిబండ తండా వాసులకు పరామర్శ

దుద్యాల్: కట్టెలు అమ్ముకుని ఒక్కో రూపాయి కూడబెట్టి.. కొనుగోలు చేసుకుని అటవీ ప్రాంతంలో జీవనం సాగిస్తున్న గిరిజనుల భూములను లాక్కునేందుకు యత్నిస్తే చూస్తూ ఊరుకోమని కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఆదివారం ఆయన రోటిబండ తండాలో ఈ నెల 25న జరిగిన లాఠీచార్జీలో గాయపడిన గిరిజన మహిళలను, తండావాసులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఫార్మా ప్రకటన వెలువడి నాటి నుంచి పోలేపల్లి, లగచెర్ల, హకీంపేట్, రోటిబండ తండా, పులిచెర్ల తండా వాసులు ప్రభుత్వ నిర్ణయాన్ని విరమించుకోవాలని కోరుతున్నారు. ఇది పట్టించుకోకుండా ప్రభుత్వం పోరాడుతున్న వారిపై లాఠీచార్జీ చేయించడం సమంజసం కాదన్నారు. గిరిజనుల భవిష్యత్‌ను అంధకారం కాకుండా ప్రభుత్వ ఫార్మాను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రజాభిప్రాయం లేకుండా తీర్మాణం ఇచ్చిన వారిని తరిమికొట్టే రోజులు దగ్గర్లో ఉన్నాయన్నారు. ప్రభుత్వ నిర్ణయం విరమించుకోకుంటే పోరాటాన్ని ఉధృతం చేస్తామన్నారు.

ఏ గ్యారంటీలు వద్దు.. మా భూముల జోలికి రావద్దు

ప్రభుత్వం అందిస్తున్న పథకాలు, గ్యారంటీలు అవసరం లేదు. మా భూముల జోలికి మాత్రం రావద్దని తండావాసులు కోరుతున్నారు. పచ్చని పొలాల్లో ఫార్మా కంపనీలు ఏర్పాటు చేయడం సరికాదని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గెలిపిస్తే ముఖ్యమంత్రి అయి తమ ప్రాంతం అభివృద్ధి చేస్తాడనుకుంటే ఫార్మా కంపెనీల ఏర్పాటుతో తమ భూములను మట్టిలో కలిపేసేందుకు సిద్ధమవ్వడం ఆందోళన కలిగిస్తుందని తండావాసులు తమ బాధను వెళ్లిబుచ్చుతున్నారు.

త్వరలో కేటీఆర్ రాక

ఫార్మా కంపనీ రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్న బాధితుల ఆందోళనకు మద్దతు తెలిపేందుకు బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వస్తారని మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి చెప్పారు. శనివారం ఆయన పలువురు బాధితులను నగరంలోని తన నివాసానికి పిలిపించుకుని అధైర్యపడొద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు చాంద్‌పాషా, యూత్ అధ్యక్షుడు సురేశ్‌రాజ్, బొంరాస్‌పేట్ మండల అధ్యక్షుడు యాదగిరి, దౌల్తాబాద్ జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కోట్ల మైపాల్, విష్ణువర్ధన్ రెడ్డి, నాయకులు నరేశ్, తండావాసులు గోపాల్ నాయక్, సోమ్లానాయక్, సంతోష్ నాయక్, రవి నాయక్, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

అట్రాసిటీ నమోదు చేయండి

రాంబాల్ నాయక్



మాట్లాడుతున్న రాంబాల్ నాయక్

గిరిజన భూములతో వ్యాపారం చేసేందుకు ప్రయత్నిస్తే ఊరుకోమని లంబడా హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు రాంబాల్ నాయక్ హెచ్చరించారు. ఆదివారం ఆయన మండల పరిధిలోని రోటిబండ తండాలో విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 25న రోటిబండ తండాలో ఫార్మా కంపనీ వ్యతిరేకించినందుకుగాను కాంగ్రెస్ నాయకుడు గిరిజనులను కులం పేరుతో ధూషిస్తారా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన్ను అరెస్ట్ చేయకుండా గిరిజనులపై లాఠీచార్జీ చేయడం సరికాదని మండిపడ్డారు. కులం పేరిట ధూషించిన వారిపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఫార్మా ఏర్పాటును రద్దు చేసేవరకు ఎల్‌హెచ్‌పీఎస్ పోరాడుతుందని తండా వాసులకు ధైర్యం చెప్పారు.

స్వచ్ఛంద సంస్థల సేవలు అభినందనీయం



హోంగార్డులకు యూనిఫాంలను పంపిణీ చేస్తున్న లయన్స్ క్లబ్, ఐవీఎఫ్ సభ్యులు

తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డి

తాండూరు టౌన్: పోలీసు అమరుల కుటుంబాలకు, హోంగార్డులకు చేయూతనందించిన లయన్స్ క్లబ్, ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ సంస్థల సేవలు అభినందనీయమని తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక డీఎస్పీ కార్యాలయ ఆవరణలో ఈ స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో పోలీసు అమరుల కుటుంబాలకు నిత్యావసర సరుకులు, 41 మంది హోంగార్డులకు యూనిఫాం అందజేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ బాలకృష్ణారెడ్డి మాట్లాడుతూ.. పోలీసు ఉద్యోగం అంటేనే తమ కుటుంబాలకు దూరంగా ఉంటూ నిత్యం ప్రజాక్షేమం కోసం పరితపించడం అన్నారు. విధి నిర్వహణలో అసువులు బాసిన వారి సంఖ్య ఎక్కువగా పోలీస్ శాఖలోనే ఉంటుందన్నారు. ఎంత ఒత్తిడి ఉన్నప్పటికీ సేవల విషయంలో ముందుంటారన్నారు. అలాంటి పోలీసులకు చేయూతనందిస్తున్న స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులకు, దాతలకు



అమరుల కుటుంబాలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న డీఎస్పీ, లయన్స్ క్లబ్ సభ్యులు

అభినందనలు చెప్పారు. అనంతరం తాండూరు లయన్స్ క్లబ్ అధ్యక్షుడు రొంపల్లి సంతోష్ కుమార్ మాట్లాడుతూ.. సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా పోలీసులకు సహకారం అందజేస్తున్నామన్నారు. భవిష్యత్‌లోనూ సేవా కార్యక్రమాలను కొనసాగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు రమేష్ చంద్ర పండిట్, అసద్, వీరప్రసాద్, ఎస్పీ శ్రీకాంత్, శివకుమార్, శ్రీధర్, పలువురు ఐవీఎఫ్ సభ్యులు పాల్గొన్నారు.

ఎంపీకి సన్మానం



విశ్వేశ్వరరెడ్డిని సన్మానిస్తున్న ప్రభాకర్‌రెడ్డి

మొయినాబాద్: రంగారెడ్డి అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ సభ్యుడిగా మండలంలోని శ్రీరాంనగర్ మాజీ సర్పంచ్ ప్రభాకర్‌రెడ్డి నియమితులయ్యారు. చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వరరెడ్డి చైర్మన్‌గా కేంద్ర ప్రభుత్వం రంగారెడ్డి జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీలో ప్రభాకర్‌రెడ్డిని సభ్యుడిగా ప్రభుత్వం నామినేట్ చేసింది. ఈ మేరకు ప్రభాకర్‌రెడ్డి ఆదివారం ఎంపీ కొండా విశ్వేశ్వరరెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

గిరిజన చట్టాలను పక్కాగా అమలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న రవీంద్రాచారి

సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవీంద్రాచారి

మీర్‌పేట: గిరిజన చట్టాలను ప్రభుత్వాలు పకడ్బందీగా అమలు చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందోజు రవీంద్రాచారి డిమాండ్ చేశారు. మీర్‌పేట లెనిన్‌నగర్‌లో ఆదివారం జరిగిన తెలంగాణ గిరిజన సమాఖ్య బాలాపూర్ మండల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని నిర్వీర్యం చేసే విధంగా ప్రభుత్వాలు వ్యవహరిస్తున్నాయని ఆరోపించారు. తద్వారా గిరిజనులపై దాడులకు పాల్పడే దోషులకు శిక్షలు పడటం లేదన్నారు. ముఖ్యంగా అటవీ హక్కుల చట్టం ప్రకారం గిరిజనులకు భూములు దక్కకపోగా, దున్నుకుంటున్న భూములను సైతం అటవీశాఖ అధికారులు బలవంతంగా లాక్కుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గిరిజనులకు చెందాల్సిన భూములకు ప్రభుత్వమే పట్టా ఇచ్చి అందజేయాలని, దీంతో పాటు ఎస్సీ,ఎస్టీ సబ్‌ప్లాన్ ప్రకారం ఎస్టీలకు జనాభా పరంగా కేటాయించిన నిధులను వారికే ఖర్చు చేయాలని కోరారు. లేదంటే రాష్ట్ర వ్యాప్తంగా గిరిజన సమాఖ్య ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని ఆయన హెచ్చరించారు. అనంతరం బాలాపూర్ మండల గిరిజన సమాఖ్య నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా జటావత్ రెడ్యానాయక్, కార్యదర్శిగా రమావత్ ఛత్రునాయక్, ఉపాధ్యక్షుడిగా రవినాయక్, సహాయ కార్యదర్శిగా కేతావత్ బాలు నాయక్, కోశాధికారిగా నేనావత్ కిషన్‌నాయక్, కార్యవర్గ సభ్యుడిగా హన్మానాయక్, కౌన్సిల్ సభ్యుడిగా దత్తునాయక్ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'భూమాత'.. ఎప్పటికో రాక!

- పెండింగ్‌లో భూ సమస్యలు
- ధరణి పోర్టల్‌తో దొరకని పరిష్కారం
- ఇష్టానుసారంగా రిజక్ట్ చేస్తున్న రెవెన్యూ అధికారులు
- తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ రైతుల ప్రదక్షిణలు
- కాంగ్రెస్ సర్కార్ తెచ్చే 'భూమాత' కోసం ఎదురుచూపులు



యాచారం తహసీల్దార్ కార్యాలయం

యాచారం: భూమాత ఎప్పుడొస్తావమ్మా.. అంటూ రైతులు కంటికికాయలు కాసేలా ఎదురుచూస్తున్నారు. ధరణి పోర్టల్‌తో భూ సమస్యలు పరిష్కారం కాక రైతులు నేటికీ ఇబ్బందులు పడుతున్నారు. యాచారం–కందుకూరు మండలాల సరిహద్దులోని ఫార్మాసిటీకి సేకరించిన భూమిలో రేవంత్‌రెడ్డి సర్కార్ ఫ్యూచర్‌సిటీ నిర్మాణానికి సంకల్పించడం తెలిసిందే. దీంతో యాచారం, కందుకూరు, ఇబ్రహీంపట్నం, మంచాల, కడ్తాల్, ఆమనగల్లు, మహేశ్వరం తదితర మండలాల్లోని అనేక గ్రామాల్లో వ్యవసాయ భూములకు భలే డిమాండ్ వచ్చింది. ఈ క్రమంలో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న తమ భూ సమస్యలు కొలిక్కి రాకపోవడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. మీ సేవల్లో రూ.వేలాది ఫీజులు చెల్లించి దరఖాస్తు చేసుకున్నా లాగిన్లలో రెవెన్యూ అధికారులు సరైన ధ్రువీకరణ పత్రాలు లేవని రిజక్ట్ చేస్తున్నారు. ఈ విషయమై ఆయా మండలాల్లోని తహసీల్దార్ కార్యాలయాల్లో సంప్రదించగా అధికారుల నుంచి సరైన సమాధానమే ఉండడం లేదని వాపోతున్నారు. కొన్ని గ్రామాల్లో భూ సమస్యలు పరిష్కరించుకోవడం కోసం డబ్బుల్లేక రైతులు తమ వ్యవసాయ భూములను విక్రయించుకున్న దాఖలాలు సైతం ఉన్నాయి.


రిజక్ట్‌పై సమాచారం కరువు

యాచారం మండలంలోని 24 గ్రామాల్లో ధరణి పోర్టల్‌లో 2,550 భూ సమస్యలు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. అందులో టీఎం–33 మ్యాడుళ్ల కింద 1,557, వివిధ రకాల మ్యాడుళ్ల కింద 993 సమస్యలు ఉన్నట్లు తేల్చారు. సమస్యల పరిష్కారం కోసం రైతులు మీ సేవల్లో రూ.వెయ్యి నుంచి రూ.2,500 వరకు డబ్బులు చెల్లించి దరఖాస్తు చేసుకున్నారు. పరిష్కరించాల్సిన రెవెన్యూ అధికారులు సరైన ధ్రువీకరణ, రికార్డులు లేవనే సాకుతో ఇష్టానుసారంగా రిజక్ట్ చేశారు. మొత్తం 2,550 దరఖాస్తుల్లో 1,800కు పైగా తిరస్కరణకు గురయ్యాయి. ఆన్‌లైన్‌లో వచ్చిన దరఖాస్తులను ఎందుకు రిజక్ట్ చేస్తున్నారనే విషయమై దరఖాస్తుదారుడికి స్పష్టమైన సమాచారం (దరఖాస్తులో పేర్కొన్న ఫోను నంబరుకు) అందించాల్సి ఉంటుంది. అధికారులు మాత్రం అవేవీ పాటించడం లేదు.

భూమాతపైనే ఆశలు


ధరణి పోర్టల్‌లోని నిబంధనలతో రైతులు తమ భూ సమస్యలు పరిష్కరించుకోవడంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని గుర్తించిన రేవంత్‌రెడ్డి సర్కార్ భూమాతను తేవాలని చూస్తోంది. దీనికి సంబంధించిన నిబంధనలు ఇంకా ఖరారు కానప్పటికీ ఆయా మండలాల్లోని తహసీల్దార్లు మాత్రం త్వరలో భూమాత వస్తుంది, మీ సమస్యలు త్వరగా పరిష్కరమయ్యే అవకాశం ఉందని చెబుతూ కార్యాలయాలకు వచ్చే రైతులను తిరిగి పంపిస్తున్నారు. భూ సమస్యలు పరిష్కారం కాక.. పట్టాదారు, పాసుపుస్తకాలు రాక రైతులు బ్యాంకు రుణాలు, రైతుబంధు, ఇతర ప్రయోజనాలు పొందక తీవ్రంగా నష్టపోయారు. దీంతో కాంగ్రెస్ సర్కార్ తీసుకువచ్చే భూమాత కోసం నిరీక్షిస్తున్నారు.

ఏళ్లుగా తిరుగుతున్నా..



పట్టా భూమి రికార్డులను ధరణి పోర్టల్‌లో నమోదు చేసి పట్టాదారు, పాసుపుస్తకం జారీ చేయాలని ఏళ్లుగా యాచారం తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా. తాడిపర్తి గ్రామంలోని సర్వే నంబర్ 239లో 20 గుంటలు, సర్వేనంబర్ 159లో ఎకరా 20 గుంటల పట్టా భూమిని ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని పలుమార్లు దరఖాస్తు చేసుకున్నా ఫలితం లేదు. ఇప్పుడేమో భూమాత అంటున్నారు. – బైకని సాయిలు, రైతు, నానక్‌నగర్

సక్రమంగా లేని దరఖాస్తులనే..



ఆన్‌లైన్‌లో వచ్చిన దరఖాస్తుల్లో సరైన రికార్డులు లేని వాటినే తిరస్కరించడం జరిగింది. త్వరలో భూమాత వచ్చే అవకాశం ఉంది. అందులో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటే సమస్యలు త్వరగా పరిష్కరించే అవకాశం ఉందని తెలుస్తోంది. నిత్యం భూ సమస్యలు పుట్టుకొస్తూనే ఉన్నాయి. సరైన రికార్డులున్న మ్యాడుళ్ల దరఖాస్తులను పరిష్కరిస్తున్నాం. – అయ్యప్ప, తహసీల్దార్, యాచారం

క్లుప్తంగా

మద్దికాయల ఓంకార్ ఆశయాలను సాధిద్దాం

ఎంసీపీఐ(యూ)రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యుడు సుధాకర్



నివాళి అర్పిస్తున్న నాయకులు

అనంతగిరి: తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు, భారత కమ్యూనిస్టు పార్టీ(ఐక్య)వ్యవస్థాపకుడు అమరజీవి కామ్రేడ్ మద్దికాయల ఓంకార్ ఆశయ సాధనకు కృషి చేయాలని ఎంసీపీఐ(యూ)రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యుడు వనం సుధాకర్ అన్నారు. ఈ మేరకు ఆదివారం కామ్రేడ్ ఓంకార్ 16వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళి అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పేదల పక్షాన పోరాడిన యోధుడు అని కొనియాడారు. సామాజిక ఉద్యమాలతో ప్రజలను చైతన్యం చేసిన గొప్ప నేత అన్నారు. ఆయన జీవితం భావితరాలకు ఆదర్శమన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ నాయకులు నర్సింలు, రూప్లానాయక్, అనంతమ్మ, హరిత, గోపాల్ పాల్గొన్నారు.

వివేకానందుని ఆశయసాధనకు కృషి చేయాలి

ఎమ్మెల్సీ గోరేటి వెంకన్న



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ గోరేటి వెంకన్న

పూడూరు: స్వామి వివేకానందుడి ఆశయ సాధనకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలని ఎమ్మెల్సీ గోరేటి వెంకన్న అన్నారు. ఆదివారం ఆయన మండల పరిధిలోని కంకల్‌లో వీరభద్ర యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్వామి వివేకానంద విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్సీ మాట్లాడుతూ.. యువతకు ఆదర్శంగా నిలిచిన మహనీయుడి విగ్రహం ఆవిష్కరించడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. ఈ కార్యక్రమంలో విగ్రహదాత మేడూరు నాగేశ్వరరావు, భాస్కర్ రెడ్డి, రఘునాథ్, వీరభద్ర యువజన సంఘం అధ్యక్షుడు రఘు పంతులు, ప్రధాన కార్యదర్శి సంతోష్‌కుమార్, బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి రవీందర్, పలువురు నాయకులు పాల్గొన్నారు.

స్కూటీ అదుపుతప్పి..

ప్రైవేట్ ఉద్యోగి మృతి



వెంకటేశ్‌కు సీపీఆర్ చేస్తున్న సహోద్యోగి

మోమిన్‌పేట: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన మోమిన్‌పేటలో ఆదివారం చోటు చేసుకుంది. వివరాలు.. సంగారెడ్డి జిల్లా సదాశివపేట పట్టణానికి చెందిన వెంకటేశ్(30) వెల్‌చాల్ సమీపంలోని పెన్నార్ కంపెనీలో ఉద్యోగస్తుడు. ఆదివారం సాయంత్రం విధులు నిర్వహించేందుకు తన స్కూటీపై సదాశివపేట నుంచి పెన్నార్ కంపెనీకి వెళ్తుండగా మార్గమధ్యలో కార్తికేయ కంపెనీ ఎదుట స్కూటీ అదుపు తప్పి పడిపోయాడు. దీంతో ఆయన ముక్కు నుంచి రక్తస్రావం, వాంతులు చేసుకున్నాడు. స్థానికులు సీపీఆర్ చేసినప్పటికీ ప్రాణాలు దక్కలేదు.

బైక్ అదుపుతప్పి వ్యక్తి మృతి

నాగోలు: బైక్ అదుపుతప్పి కిందపడటంతో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన నాగోలు పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. నాగోలు ఎస్ఐ రమేష్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి..మేడ్చల్ జిల్లా, కొర్రెములకు చెందిన పడిగం జంగయ్య(43) టైలర్‌గా పని చేసేవాడు. ఈనెల 25న బైక్‌పై బొంగుళూరుకు వెళుతుండగా గౌరెల్లి చౌరస్తా సమీపంలో బైక్ అదుపు తప్పి కింది పడటంతో అతని తలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు అతడిని బీఎన్‌రెడ్డి నగర్‌లోని వెల్‌నెస్ హాస్పిటల్‌కు తరలించగా పరీక్షించిన వైద్యులు మెరుగైన వైద్యం కోసం ఉస్మానియా జనరల్ హాస్పిటల్‌కు రెఫర్ చేశారు. అక్కడ చికిత్స పొందుతున్న జంగయ్య ఆదివారం మృతి చెందాడు. మృతుడి భార్య కృష్ణవేణి ఫిర్యాదు మేరకు ఆదివారం నాగోలు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పథకాలు వర్తించవా..?

- గ్యాస్ సబ్సిడీ, గృహజ్యోతి పథకం లబ్ధి కోసం అర్హుల పాట్లు
- కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు
- ఎడిట్ ఆప్షన్ లేదంటూ చేతులెత్తేసిన అధికారులు
- కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేసినా ఫలితం లేదంటూ ఆందోళన

ధారూరు: గ్యాస్ సబ్సిడీ అందక, జీరో విద్యుత్ బిల్లు వర్తించక పేదలు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వ పథకాలకు నోచుకోని పేదలకు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓకు ఫిర్యాదు చేయడం, ప్రజాపాలన దరఖాస్తులు పరిశీలించడం .. త్వరలోనే వర్తింస్తుందని ఆశచూపి పంపించి వేదయం నిత్యకృత్యమైంది.

ఆపరేటర్ల తప్పిదం.. పేదలకు శాపం

ఆన్‌లైన్ దరఖాస్తులు పరిశీలిస్తున్న కంప్యూటర్ ఆపరేటర్లకు నాట్ అప్లైడ్, నాట్ మ్యాచ్ అంటూ



ధారూరు ఎంపీడీఓ కార్యాలయంలో బారులుతీరిన జనం

చూపుతుండడంతో వారు సైతం ఏమి చేయలేక పోతున్నారు. ప్రజాపాలన దరఖాస్తులను కంప్యూటరీకరణ సమయంలో ఆపరేటర్లు చేసిన పొరపాట్లు పేదలకు శాపంగా మారాయి. దరఖాస్తుదారు భార్య పేరుంటే భర్త పేరు.. ఆధార్ కార్డు నంబర్ మార్చడం.. 200 యూనిట్ల వరకు వినియోగించిన విద్యుత్ బిల్లులో యూనిట్లు నమోదు చేయకుండా సున్నా ఎంటర్ చేయడం, గ్యాస్ నంబర్ మ్యాచ్ కాకపోవడం తదితర తప్పిదాలతో తమకు లబ్ధి చేకూరడం లేదని వాపోతున్నారు. అద్దె ఇళ్లలో ఉంటున్న వారికి జీరో బిల్లు వర్తించడం లేదని.. మీటర్ యజమాని పేరిట ఉండడం కూడా తప్పేనా అంటూ పలువురు ప్రశ్నిస్తున్నారు. ఎడిట్ ఆప్షన్ లేకపోవడంతో వేల దరఖాస్తులు పెండిగ్‌లోనే ఉంటున్నాయంటున్నారు. గృహజ్యోతి దరఖాస్తుల్లో కొన్నింటిని పరిష్కరించినా చాలా వరకు పెండింగ్‌లోనే ఉన్నాయంటూ అధికారులే వెల్లడిస్తున్నారు.

మరో అవకాశం కల్పించండి

ప్రజాపాలన దరఖాస్తులకు అవకాశం లేదు. ఆపరేటర్లు చేసిన తప్పిదాలతో పథకాలను వర్తించని పేదల వివరాలు సరిచేయడానికి ఎడిట్ ఆప్షన్ లేక అనేక మంది అర్హులు ఇబ్బంది పడుతున్నారు. కాగా తమకు దరఖాస్తు చేసుకునే వీలు లేదా ఎడిట్ ఆప్షన్ సౌకర్యం కల్పించాలని పేదలు డిమాండ్ చేస్తున్నారు.

బొప్పాయి.. ఆకారం వింతోయి!

ప్రకృతిలో వింతలు.. విశేషాలు ఎన్నో చూస్తుంటాం.. పళ్లు, కూరగాయలు, పూలు వివిధ ఆకారాల్లో కనిపిస్తూ ఆశ్చర్యం కలిగిస్తుంటాయి. తాజాగా మండల పరిధిలోని పులిచెర్లకుంట తండాలో గోపాల్ నాయక్ ఇంటి ఆవరణలో బొప్పాయి చెట్టుకు కాసిన కాయ చాయి కేతిరి ఆకాంలో కనిపిస్తూ ఆకర్శిస్తోంది. వింత ఆకారంలో ఉన్న ఈ కాయను చూసేందుకు గ్రామస్తులు ఆసక్తి కనబరిచారు. - దుద్యాల్



సాధ్యం కాని హామీలు ఇచ్చి మోసం



దివ్యాంగులకు ట్రై సైకిళ్లు పంపిణీ చేస్తున్న నర్సింహారెడ్డి, డాక్టర్ ఆనంద్

జీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఆనంద్

మోమిన్‌పేట: కాంగ్రెస్‌ను నమ్మి ఓటేసిన రైతులను ప్రభుత్వం నిండా ముంచుతోందని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ ఆరోపించారు. ఆదివారం ఆయన మండల పరిధిలోని చీమల్‌దరి మాజీ సర్పంచ్ నర్సింహారెడ్డి జన్మదిన వేడుకలకు హాజరయ్యారు. పుట్టిన రోజు సందర్భంగా నర్సింహారెడ్డి 12 మంది దివ్యాంగులకు ట్రై సైకిళ్లను పంపిణీ చేశారు. అనంతరం పలువురు అభిమానులు, పార్టీనాయకులు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఆనంద్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే ఎకరారకు రూ.15వేలు రైతు భరోసా ఇస్తామని చెప్పి వానాకాలం పంటకు ఇవ్వకుండా యాసంగి పంటకు ఇస్తామని రైతులను మోసం చేస్తోందన్నారు. గొప్పలకు పోయి హామీలు ఇచ్చి ఇప్పుడు చేతులెత్తేస్తున్నారని మండిపడ్డారు. బీఆర్ఎస్ రైతుల పక్షాన పోరాడుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు డి.వెంకట్, పీఏసీఎస్ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శ్రీకాంత్‌గౌడ్, నాయకులు తిరుపతిరెడ్డి, అనూప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న యువకుడి మృతి



వెంకటేశ్(ఫైల్)

దుద్యాల్: పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసిన ఓ యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటన అల్లాఖాన్‌పల్లిలో ఆదివారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన గందె హన్మయ్య, మాణెమ్మ దంపతుల కుమారుడు వెంకటేశ్(25) కోస్గిలోని ఓ దుకాణంలో పనిచేస్తున్నాడు. ఆయన వ్యక్తిగత సమస్యలతో ఈ నెల 23న పొలం వద్ద పురుగుమందు తాగి ఆత్మహత్యకు యత్నించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చాడు. దీంతో వారు వెంటనే కోస్గిలో ఆస్పత్రికి తరలించారు. అక్కడ పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స నిమిత్తం నగరంలోని గాంధీ ఆస్పత్రికి తీసుకెళ్లారు. చికిత్స పొందుతున్న వెంకటేశ్ ఆదివారం రాత్రి 9 గంటల ప్రాంతంలో మృతి చెందాడు. ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

కుటుంబ కలహాలతో గృహిణి..

చేవెళ్ల: కుటుంబకలహాల నేపథ్యంలో భార్యాభర్తలు గొడవపడగా మనస్తాపానికి గురైన భార్య పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. వెంటనే కుటుంబసభ్యులు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. ఈ సంఘటన చేవెళ్ల పోలీస్‌స్టేషన్ పరిధిలోని చనువెల్లిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వికారాబాద్ జిల్లా పూడూరు మండలం పోతిరెడ్డిగూడకు చెందిన వనజ (28)కు చేవెళ్ల మండలంలోని చనువెల్లి గ్రామానికి చెందిన నగేశ్‌తో 11ఏళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఇద్దరు పిల్లలు (ఓ కూతురు, కుమారుడు) ఉన్నారు. వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. శనివారం రాత్రి ఇంట్లో కుటుంబ విషయాలపై భార్యాభర్తలు గొడవపడ్డారు. దీంతో ఆమె మనస్తాపంతో పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. వెంటనే కుటుంబ సభ్యులు వికారాబాద్‌లోని ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్న ఆమె ఆదివారం తెల్లవారుజామున మృతి చెందింది. మృతురాలి సోదరుడు వంశీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహానికి చేవెళ్ల ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబసభ్యులకు అప్పగించారు.

బైక్ ఢీ.. వ్యక్తి మృతి

కేశంపేట: బైక్‌ను అజాగ్రత్తగా నడిపి రోడ్డు దాటుతున్న వ్యక్తిని ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. కేశంపేట గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని బోధునంపల్లి గ్రామానికి చెందిన బండ రాంరెడ్డి(62) కేశంపేట గ్రామంలోని వైన్స్‌షాపు దగ్గర రోడ్డు దాటుతుండగా కేశంపేట వైపు వస్తున్న బైక్ ఢీ కొట్టినట్టు తెలిపారు. ఈ ఘటనలో రాంరెడ్డి ప్రమాద స్థలంలోనే మృతి చెందినట్టు గ్రామస్తులు తెలిపారు. మృతుడికి భార్యతో పాటు ఇద్దరు పిల్లలు ఉన్నట్లు గ్రామస్తులు తెలిపారు. ఈ సంఘటనపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

ఉరేసుకుని వ్యక్తి బలవన్మరణం

గౌలిపురా: భార్య గొడవపడి పిల్లలతో సహా పుట్టింటికి వెళ్లిపోవడంతో మనస్తాపానికి లోనైన ఓ వ్యక్తి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మొఘల్‌పురా పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ పి.నాగదుర్గా ప్రసాద్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. నాగులచింత ఆర్య మైదాన్ ప్రాంతానికి చెందిన సంఘమేశ్వర్ (37), శోభా దంపతులకు ఇద్దరు సంతానం. కుటుంబ కలహాల కారణంగా శోభ పిల్లలతో కలిసి పుట్టింటికి వెళ్లిపోయింది. అప్పటి నుంచి డిప్రెషన్‌తో బాధపడుతున్న సంఘమేశ్వర్ ఆదివారం ఉదయం ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యుల సమాచారంతో సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

టీపీఎస్‌సీఎఫ్ జిల్లా అధ్యక్షుడిగా మధుకర్‌రెడ్డి

అనంతగిరి: తెలంగాణ పంచాయతీ సెక్రటరీస్ డిస్ట్రిక్ సెంట్రల్ ఫోరం(టీఎన్‌జీవో అనుబంధం)జిల్లా అధ్యక్షుడిగా మధుకర్‌రెడ్డి నియమితులయ్యారు. శనివారం వికారాబాద్‌లోని టీఎన్‌జీవో కార్యాలయంలో టీఎన్‌జీవో అధ్యక్షుడు శివకుమార్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో నూతన కమిటీ నియామకం చేపట్టారు. టీపీఎస్‌సీఎఫ్(తెలంగాణ పంచాయతీ సెక్రటరీస్ డిస్ట్రిక్ సెంట్రల్ ఫోరం) జనరల్ సెక్రటరీగా రాంవిహార్, అసోసియేటెడ్ అధ్యక్షుడిగా వేమారెడ్డి, ఉపాధ్యక్షులుగా ఎస్.రమేష్, కృష్ణవేణి, అడ్వైజర్లుగా కిషన్‌రెడ్డి, బాల్‌రాజు, జాయింట్ సెక్రటరీగా కృష్ణ, కోశాధికారిగా మల్లేశం, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా విశ్వతేజ, ఆనంద్, పబ్లిసిటీ కార్యదర్శులుగా శివసాయి రాఘవ, దీప కులకర్ణి, కార్యవర్గసభ్యులుగా శ్రావణ్‌కుమార్, శ్రీనివాస్, లవరెడ్డి, జగదీశ్వర్, మారుతి, రాములు, భవాని నియమితులయ్యారు. ఈ సందర్భంగా మధుకర్‌రెడ్డి మాట్లాడుతూ.. తన నియామకానికి సహకరించిన ప్రతీ ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. పంచాయతీ కార్యదర్శుల సమస్యల సాధనకు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో టీఎన్‌జీవో జిల్లా ప్రధాన కార్యదర్శి అజ్మత్‌పాషా, నర్సింలు, రమేష్ తదితరులు పాల్గొన్నారు



టీపీఎస్‌సీఎఫ్ జిల్లా నూతన కార్యవర్గం

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

షాబాద్: పచ్చదనం, వాతావరణ సమతుల్యానికి ప్రతి ఒక్కరూ విరివిగా మొక్కలు నాటి సంరక్షించాలని యాంటి కరప్షన్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు బేగరి యాదయ్య పేర్కొన్నారు. ఆదివారం మండల పరిధిలోని చందనవెళ్లి గ్రామంలో గ్రామస్తులతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ తమవంతుగా మొక్కలు నాటి, సంరక్షణ బాధ్యతలు చేపట్టాలన్నారు. గ్రామాల్లో ఖాళీ స్థలాల్లో మొక్కలు నాటి, గ్రామాన్ని పచ్చగా కళకళలాడేలా చూడాలన్నారు. పర్యావరణాన్ని పరిరక్షిస్తేనే మానవ మనుగడ సాధ్యమవుతుందన్నారు. ఆరోగ్యవంతమైన మానవ జీవన మనుగడకు 33 శాతం అడవులు ఉండాలని, ప్రస్తుతం 24 శాతం మాత్రమే ఉన్నాయన్నారు. మొక్కలు నాటి అడవులను పెంచేందుకు కృషి చేస్తే భవిష్యత్ తరాల వారికి ఎంతో మేలు చేసినవారవుతామని సూచించారు. కార్యక్రమంలో గ్రామస్తులు సత్తయ్య, వెంకట్, రాజ్‌కుమార్, ప్రభాకర్, సుధాకర్, శ్రీకాంత్, మధుసూదన్‌రెడ్డి, యాదయ్య ఉన్నారు.

గ్రంథాలయ చైర్మన్‌ను కలిసిన నాయకులు



మధుసూదన్‌రెడ్డిని సన్మానిస్తున్న ఉపాధ్యాయ సంఘం నాయకులు

శంకర్‌పల్లి: గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్‌గా నియామకమైన ఎలుగంటి మధుసూదన్‌రెడ్డిని ఆదివారం టీయూటీఎఫ్ నాయకులు మర్యాదపూర్వకంగా ఆయన నివాసంలో కలిశారు. అనంతరం ఆయనకు పూలదండ, శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. మండల గ్రంథాలయాన్ని ఆధునీకరించి, మౌలిక వసతులు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా గ్రామాల్లో గ్రంథాలయాలను అభివృద్ధి చేసి విద్యార్థులు, యువత, పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థులకు బాసటగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్ రాజశేఖర్‌రెడ్డి, టీయూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రఘునందన్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి మునీర్ పాషా, శంకర్‌పల్లి మండల అధ్యక్షుడు అంజయ్య, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసచారి, ఉపాధ్యాయులు మోహన్‌రెడ్డి, సుదర్శన్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

భవనం పైనుంచి దూకి యువకుడి ఆత్మహత్య

బంజారాహిల్స్: భవనం పైనుంచి దూకి ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. శ్రీనగర్‌కాలనీలోని శ్రీసాయిరామ్ మనోర్ అపార్ట్‌మెంట్‌లో ఉంటున్న శ్రీనివాస్ రెడ్డి రియల్‌ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నాడు. అతడి పెద్ద కొడుకు సాయిసుదీప్‌రెడ్డి(21) మహేంద్ర యూనివర్సిటీలో బీటెక్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. ఇటీవలే శ్రీనివాస్‌రెడ్డి మధురానగర్‌కు మారాడు. ఈ నెల 24న సాయిసుదీప్‌రెడ్డి స్నేహితులతో కలిసి తన బర్త్‌డే వేడుకలు జరుపుకున్నాడు. 26న సాయంత్రం అతను తన స్నేహితులతో కలిసి సాయిరామ్ మనోర్ అపార్ట్‌మెంట్‌కు వెళ్లాడు. 5.30 సమయంలో తన స్నేహితుడు మనీష్‌తో పాటు మరో ఇద్దరితో కలిసి టెర్రస్ పైకి వెళ్లాడు. వారితో మాట్లాడుతున్న సాయిసుదీప్ సూర్యాస్తమయం చాలా బాగుంది చూడాలని వారి దృష్టి మరల్చి ఐదో అంతస్తు నుంచి కిందకు దూకాడు. తీవ్రంగా అక్కడికక్కడే మృతి చెందాడు. గత రెండు రోజులుగా తన కుమారుడు మూడీగా ఉంటున్నాడని, తీవ్ర డిప్రెషన్‌తో బాధపడుతున్నాడని మృతి తండ్రి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వైద్య శిబిరాలతో పేదలకు మేలు



పెద్దేముల్: ఓంలానాయక్ తండాలో వైద్య శిబిరం ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

పెద్దేముల్: ఉచిత వైద్య శిబిరాలతో పేదలకు మేలు చేకూరుతుందని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండల పరిధిలోని ఓంలానాయక్ తండాలో సుమిత్రారాథోడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్యశిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గిరిజనుల ఆరోగ్య రక్షణకు వైద్య శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. అనంతరం సుమిత్ర ఆస్పత్రి యాజమాన్యాన్ని అభినందించారు.

ఆలయాల అభివృద్ధికి కృషి

తాండూరు రూరల్: ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తానని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మండల పరిధిలోని గోనూర్ గ్రామ సమీపంలోని మాచనూర్‌లో శివయోగి గురు బీరప్ప ఆశ్రమాన్ని సందర్శించారు. నారాయణపూర్ రోడ్డు నుంచి ఆశ్రమం వరకు రోడ్డు సౌకర్యం కల్పించాలని భక్తులు ఎమ్మెల్యేను కోరారు. ఈ కార్య క్రమంలో పెద్దేముల్ జెడ్పీటీసీ మాజీ సభ్యుడు ధారాసింగ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఉదయ్ భాస్కర్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ నాయకుడు అనిల్, జగదీష్, మాణిక్‌రావు పాల్గొన్నారు.

సకాలంలో వేతనాలు చెల్లించాలి

సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి సుధాకర్

అనంతగిరి: క్షేత్ర స్థాయిలో పనిచేస్తున్న పంచాయతీ కార్మికులకు రెగ్యులర్‌గా వేతనాలు చెల్లించాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి పి.సుధాకర్ డిమాండ్ చేశారు. ఆదివారం వికారాబాద్‌లోని సీఐటీయూ కార్యాలయంలో పంచాయతీ కార్మికుల ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ.. కాలపరిమితి లేకుండా విధులు నిర్వహిస్తున్న పంచాయతీ కార్మికులకు చాలీచాలని వేతనాలతో కుటుంబ పోషణ భారమైందన్నారు. పనిభారం ఉన్నప్పటికీ పనిచేస్తున్న వారికి ప్రభుత్వం కనీసం రూ.26వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని కోరారు. ప్రమాదవశాత్తు మృతి చెందిన కార్మికులకు రూ.20 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని కోరారు.



మాట్లాడుతున్న సుధాకర్

విద్యార్హత ప్రకారంగా ప్రమోషన్లు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి రామకృష్ణ, మైపాల్, చంద్రయ్య, శ్రీనివాస్, రాములు, అర్జున్, అంజయ్య, పరమేష్, పద్మమ్మ, జయమని, నర్సింలు, అనంతయ్య, రవి, వెంకటయ్య, పెంటయ్య, హన్మానాయక్, సద్దాం, వెంకటేష్, రాములు తదితరులు పాల్గొన్నారు.

క్లినిక్‌లపై దాడులతో పరువుపోయింది



ఎమ్మెల్యేతో మాట్లాడుతున్న ఆర్ఎంపీ వైద్యులు

ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డితో ఆర్ఎంపీ వైద్యులు

తాండూరు: మా క్లినిక్‌లపై దాడులు చేయడంతో తమ పరువు పోయిందంటూ ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి ఎదుట తాండూరు ఆర్ఎంపీ, పీఎంపీ అసోషియేషన్ సభ్యులు మొరపెట్టుకొన్నారు. ఆదివారం తాండూరు ఆర్ఎంపీ, పీఎంపీ వైద్యులు ఎమ్మెల్యేను కలిశారు. తెలంగాణ మెడికల్ కౌన్సిల్ బృందం తాండూరులో తమ క్లినిక్‌లపై దాడులు చేయడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నామన్నారు. సమాజంలో గౌరవంగా క్లినిక్‌లను నిర్వహిస్తు జీవిస్తున్న తమపై దాడులు చేసి పరువు తీశారంటూ ఎమ్మెల్యే ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో ఎమ్మెల్యే స్పందించి వైద్యశాఖ అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. ఎలాంటి సమస్య రాకుండా చూస్తానంటూ ఆర్ఎంపీ వైద్యులకు భరోసా కల్పించారు. అనంతరం డీఎస్సీ అభ్యర్థులు మిగిలిన సీట్లను జనరల్ కేటగిరీలో భర్తీ చేయాలంటూ ఉర్దూమీడియం అభ్యర్థులు ఎమ్మెల్యేకు వినతిపత్రం అందించారు. సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



శంకర్‌పల్లి: ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

షాద్‌నగర్‌రూరల్: పట్టణంలోని హరిజనవాడ ప్రాథమికోన్నత పాఠశాలలో 1996–97లో 7వ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఒకరికొకరూ ఆత్మీయంగా పలకరించి పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు భారతమ్మ, విజయలక్ష్మి, ఝాన్సీ, విద్యార్థులు శివశంకర్, శ్రీకాంత్, ఆనంద్, రాజ్‌కుమార్, ఉదయ్, జగదీశ్వర్, రాజేశ్, వెంకటేశ్, బాలమణి, కస్తూరి, కల్పన, కవిత, అనిత, రమ, రాధిక, అనురాధ, దుర్గేశ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

శంకర్‌పల్లి: మండల పరిధిలోని జన్వాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2002–03 సంవత్సరంలో పదో తరగతి పూర్తయిన విద్యార్థులు ఆదివారం జన్వాడలోని గ్రీన్ ఫీల్డ్ హాలులో ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేసుకున్నారు. ఈ సందర్భంగా వారికి విద్యాబుద్ధులు నేర్పిన గురువులకు శాలువా, పూలదండలు వేసి ఘనంగా సన్మానించారు. అనంతరం తమతో పాటు చదువుకొని మృతి చెందిన స్నేహితులకు నివాళులర్పించారు. ఒకరికొకరూ ఆప్యాయంగా పలకరించుకొని మురిసిపోయారు. ముగింపులో పాఠశాల మరమ్మతుల కోసం తమవంతు సాయం చేసేందుకు ముందుంటామని స్పష్టం చేశారు.



షాద్‌నగర్‌రూరల్: ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు